# నాగరాజు

## శ్రీమతి శుభ

"నాగపూజ సినిమాలో ఒక చిన్న పాప పాములాగ ప్రవర్తిస్తూ ఉంటుంది రాత్రిపూట ఆ పాప నాగుపాముగా మారి దుష్టశిక్ష, శిష్టరక్ష చేస్తూ వుంటుంది ఆమె పిలిస్తే చాలు కొండల్లో నుంచి కోనల్లో నుంచి పాములు బిలబిలా వచ్చేస్తూ వుంటాయి నృత్యం చేస్తాయి సంగీత వాద్యాలు మోగిస్తాయి వాటిలోనూ- మంచివీ చెడ్డవీ! వాటికి పగలూ ప్రణయాలూ! ఒకటి కాటు వేస్తే మరొకటి వచ్చి విషాన్ని పీల్చేసి మనిషిని బ్రతికించడం' ,, వాటిలోనూ రాజకీయాలు!

నాగపట్నం ప్రజల్ని ఆసినిమా బ్రహ్మాండంగా ఆకర్షించింది ముఖ్యంగా మహిళల్ని పిల్లల్ని

ఆ సినిమా హాలుకి ఎదురుగా ఒకరిక్షా దాని రెండు ప్రక్కలా-

అద్భుత సర్ప ప్రదర్శన

అఖిల భారత ఖ్యాతి గాంచిన నాగరాజు గారి

స్నేక్ షో

ప్రవేశ రుసుము ఒక రూపాయి మాత్రమే

అని రాసి ఉన్న బోర్డులు

సినిమా నుండి జనం బయటకు వస్తున్న సమయంలో రిక్షాలో కూర్చున్న కుర్రాడు మైక్ అందుకొని-

సినిమా చూసి వస్తున్న మహాజనులారా! వినండి! మీరిప్పుడు తెరమీద పాములు చూసి వస్తున్నారు అవి నిజం పాములు కావు! సినిమా ట్రిక్కులు! పాములు అలా ప్రవర్తించవు! రండి! సజీవ సర్పాల్ని చూడండి వాటి గురించి 'తెలుసుకోండి మూఢనమ్మకాలు తొలగించు కోండి అని ఉపన్యాసం ప్రారంభించాడు

నాగపట్నంలో సర్ప ప్రదర్శన రెండు వారాలుగా జరుగుతోంది నాగరాజు ఆంధ్రుడే చదువు వంటబట్టక పదో క్లాసుతో ఆపేసి యింట్లోంచి పారిపోయి అడవుల్లో తిరుగుతూ ఆదివాసుల్ని మచ్చిక చేసుకుని పాములు పట్టడం విషం పిండడం నేర్చుకున్నాడు వాటిలో రకాలూ అలవాట్లు క్షుణ్ణంగా పరిశీలించాడు

వాటి గురించి ఒక పుస్తకం రాయాలనీ ప్రజల మూఢ నమ్మకాల్ని రూపు మాపాలని కోరిక కలిగింది చిన్న లారీ గాజు తొట్టెలు గట్రా వ్యానుకూర్చుకుని ఊరూరు తిరుగుతూ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నాడు

మ్యాటినీ చూసి బయటకు వస్తూ స్నేక్‌షో ప్రకటన విన్న బుజ్జి 'అక్కడికి వెళ్దామని మారాం చేస్తే - కుర్రాడు ముచ్చట పడుతున్నాడు కదాని తీసుకు వెళ్ళాడు చిన్నారావు

పొడుగ్గా గుడారంలో మధ్యగా ఈ చివర నుండి ఆ చివరకు తాడు కట్టబడి వుంది ఆ హద్దుదాటి ఎవరూ లోనికి వెళ్ళ కూడదు తాడుకు అటు ప్రక్కగా పొడవునా బెంచీలున్నాయి- ఎత్తుగా వాటి మీదున్న గాజు తొట్టెల్లో పాములున్నాయి మూత తెరిచి తొట్టెలో చుట్ట బెట్టుకుని పడుకున్న పాముని బయటకు తీసి వివరిస్తున్నాడు నాగరాజు

అక్కడ సుమారు పాతిక మంది ఉంటారు వాళ్ళెవరూ ఉపన్యాసం వినడం లేదు! నాగరాజు శరీరం మీద ప్రాకుతున్న పాముల్ని వింతగా చూస్తున్నారు!

అతని షర్ట్ జేబులో దూరిన ఒక పాము పిల్ల తలపైకెత్తి మనుషుల వైపు వింతగా చూస్తోంది మరొకటి ఫ్యాంట్ జేబులో దూరడాన్కి ప్రయత్నిస్తోంది ఇంకొకటి పాగా లాగ తలకు చుట్టుకొని పైకి వెళ్ళాలా కిందకు వెళ్ళాలా అని కాబోలు ఆలోచిస్తోంది!

బుజ్జి చిన్నారావు నోళ్ళు తెరచి దిగ్భ్రాంతిగా చూస్తున్నారు

చీమ చిటుక్కుమన్నా వినగలిగే వాడికి పాము చెవులున్నాయి అంటారు గాని పాముకి చెవులు లేవుసార్! భూమిలో కలిగే ప్రకంపనాలను గ్రహించి ఎదురుగా ఏదోవస్తున్నదని తెలుసుకుంటుంది పాము అలా తెలుసుకుని తల ఎత్తి చూస్తుంది అస్తమానం నాలుకను బయటకు చాపి వాయు తరంగాల నుండి శత్రువుల రాకను గ్రహిస్తుంది సంగీతం విని పాము నృత్యం చేస్తుందనడం శుద్ధ అబద్ధం! నాగస్వరం ఊదేవాడ్ని గమనించండి అతడు నాగస్వరం ఊదుతూ తల యిటూ అటూ తిప్పుతోంటే చలించే వాద్యాన్ని చూస్తున్న పాము కూడా తల తిప్పుతుంది! అది నృత్యం కాదు! ఆ వాద్యం తన మీద కొచ్చి పడుతుందేమో నన్న భయం! అందుకే జాగ్రత్తగా వాద్యాన్ని పరిశీలిస్తూ అది ఎటు తిరిగితే తల అటు తిప్పుతుంది!"

అలా చెబుతూనే ఒక తొట్టెలో చేయి పెట్టి పాముని బయటకు తీసాడు నాగరాజు బయటకు వస్తూనే అది ఖస్సుమని అతని చేతి మీద కాటు వేసింది ప్రేక్షకులంతా హడలిపోయి దూరంగా జరిగారు ఏమీ జరగనట్లే నాగరాజు మాట్లాడుతూనే రెండో చేతితో పాము తలను గట్టిగా పట్టుకున్నాడు అది విల విలలాడిపోతూ ఆ రెండో చేతికి చుట్టుకుంటోంది

నవ్వుతూ ప్రేక్షకుల వైపు చూసాడు "భయపడకండి కాటు వేసే ప్రతి పామూ కాలనాగు కాదు! ఇది విషం లేని పాము! ప్రమాదకరం కాదు' అంటూ ఆ పాము దౌడలు రెండూ విడదీసి దాని కోరల నిర్మాణం చూపించాడు తర్వాత తన మీద ప్రాకుతున్న పాములన్నింటిని తీసేసి తొట్టెల్లో ఉంచేశాడు

చివరి బెంచీ మీద పెద్ద శవపేటిక లాగ గాజు పెట్టె ఒకటుంది దానిలో ఒక ప్రక్క పాలగిన్నె మరొక ప్రక నాలుగైదు కోడిగుడ్లు ఉన్నాయి

గుడారంలో ఒక ప్రక్క ప్రత్యేకంగా కొన్ని తొట్టెలున్నాయి అవన్నీ విషనాగులు ఒక చేతితో తల రెండో చేతితో తోక ఒడుపుగా పట్టుకొని ఒక నాగు పాముని జాగ్రత్తగా తెచ్చాడు నాగరాజు దానికి నిన్నటి నుండి ఆహారం యివ్వలేదట

దాన్ని చాలా జాగ్రత్తగా చివరి బెంచీ మీదున్న పేటికలోనికి ఒదిలాడు నాగరాజు ఆహారం కోసం అది ఆత్రంగా పేటిక అంతా కలియదిరుగుతోంది కాని పాలు తాగలేదు! గుడ్లు తినలేదు!

' చూశారా' మనవాళ్ళు నాగుల చవితి పేరు చెప్పి ఎన్ని పాలు, గుడ్లు వృధా చేస్తున్నారో! అని పక పక నవ్వేశాడు నాగరాజు అలా నవ్వుతూనే బోనులో నుంచి ఒక ఎలుకను తీసి పేటికలో ఒదిలిపెట్టాడు

వెంటనే పాము ఆహారాన్ని గుర్తించింది! ఎలుక అపాయాన్ని గ్రహించింది!

ప్రాణ భీతితో ఎలుక ఆ కాస్త చోటులోనే పరిగెత్తుతూ తప్పించుకోడాన్కి ప్రయత్నిస్తోంటే ఆకలితో దహించుకుపోతున్న పాము బుసలు కొడుతూ దాన్ని అందుకోడాన్కి ఆత్రపడుతోంది!

ప్రేక్షకులకు ఎంత థ్రిల్! ఎంత అద్భుతం!

చూస్తూ వుండగానే పాము ఫెళ్‌మని ఎలుకను కాటు వేసి కదలకుండా చుట్టబెట్టుకుంటూ వుంటే ఎలుక గిజ గిజలాడుతూ అరుస్తోంటే-

అయ్యో పాపం అనుకున్నారు కొందరు

భలే బలే అనుకున్నాడు చిన్నారావు!

తర్వాత మరో నాగు పాముని తెచ్చి విషం ఎలా తీస్తారో చూపించాడు నాగరాజు దానికి కోపం జాస్తి కాబోలు! రుస రుసలాడుతూ బుస్ బుస్‌మని గాలిని కాటు వేస్తోంది విషం అంతా పిండేశాక- నాగరాజు ఏమరిపాటుగా వుండగా- ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్నట్లు అతని చేతిమీద రక్‌మని కాటు అందుకుంది!

ప్రేక్షకుల గుండెలు ఝల్లుమన్నాయి!

వారి ముఖాల్లోని భయం చూసి నవ్వుకున్నాడు నాగరాజు, 'విషం అంతా పిండేశాను కదా! మళ్లా






విషం తయారు కావడానికి కొన్ని గంటలు పట్టుతుంది. ఇప్పుడిది కాటు వేసినా ఫర్వాలేదు'' అంటూ దాన్ని మెడకు చుట్టుకున్నాడు.

''రండి సార్! మీలో సాహసవంతులు ముందుకు వచ్చి ఈ నాగరాజుని మెడలో ధరించండి! రండి సార్! ఆహ్వానించాడు నాగరాజు.

అందరి ముఖాల్లోనూ భయమే! ఎవరూ ముందుకు రాలేదు.

ధైర్యంగా దృఢంగా కనిపించిన చిన్నారావుని ఆహ్వానించాడు నాగరాజు.

చిన్నారావు ఒక అడుగు ముందుకేసాడు. నాగరాజూ ఒక అడుగు ముందుకు వచ్చాడు. అతని మెడలో వున్న నాగరాజు భయంకరంగా బుసకొట్టి మెరుపు వేగంతో పడగ విసిరింది!

ఆ కాటు సరిగా నెత్తి మీద పడవలసిందే. ఒక్క అంగుళంలో తప్పించుకున్నాడు చిన్నారావు.

అందరి గుండెలూ గుభేల్ మన్నాయి. చిన్న పిల్లలు కవ్వున అరిచేశారు.

అంతే! చిన్నారావు బుజ్జిని లాక్కుని బిర బిర బయటకు పోయాడు.

అతని కంగారు చూసి నవ్వుకున్నాడు నాగరాజు. ''పాముల్లో 90 శాతం నిరపాయకరం. కాటు వేసినా ప్రమాదం లేదు. మిగిలిన పది శాతంలో కూడా అన్ని వేళలా విషం ఉండదు. విషం లేనప్పుడు కాటు వేసినా ఫర్వాలేదని మీరు కళ్లారా చూసారు. ప్రజలు మూఢంగా మంత్రగాళ్ళని నమ్ముతున్నారు. తిత్తుల్ల నిండా విషం వున్న పాము కాటేస్తే ఏ మంత్రగాడూ

రక్షించలేడు! ఆలస్యంగా అయితే డాక్టర్లూ రక్షించలేరు! నిరపాయకరమైన పాము కాటు వేస్తే మాత్రం మంత్రగాడు ఫోజు పెట్టి తన వల్లనే మనిషి బ్రతికినట్లు చెప్పుకుంటాడు మంత్రాలు లేవు వాళ్ళని నమ్మకండి అలవాటుగా ఉపన్యాసం దంచేస్తున్న నాగరాజు దృష్టి గుమ్మం వద్ద తచ్చాడుతున్న ఒక వ్యక్తి మీద పడింది

ఆయన పరమేశ్వరశాస్త్రి ఖద్దరు పంచె కట్టుకుని బుజం చుట్టూ పండిత శాలువా కప్పుకున్నాడు ముఖంలో వర్చస్సు కళ్ళల్లో వెలుగు నుదుట మూడు రేఖలు విభూతి మధ్య రేఖ మధ్యగా గంధం కుంకుమ బొట్టు

మనవడు స్నేక్‌షోకి వెళ్లాడని తెలిసి వాడిని పిలుచుకు వెళ్ళడానికని వచ్చాడాయన నాగరాజు ఉపన్యాసం విని నవ్వుకుంటున్నాడాయన

ఏం పంతులుగారూ! నవ్వుకుంటున్నారు! నేను చెప్పిన దానిలో తప్పు ఉందా? అడిగాడు నాగ రాజు కవ్వింపుగా

శాస్త్రి లోనికి వచ్చాడు ముఖం గంబీరంగా వుంది మిడి మిడి జ్ఞానంతో మిడిసి పడ కు నాయనా! సైన్స్ సైన్స్ అంటారు గాని ఆ సైన్స్‌కి అందని విషయాలూ వున్నాయి పాము మంత్రం నాకు తెలుసు ఎందరినో రక్షించాను అన్నాడు సౌమ్యంగానే

'అవన్నీ విషం లేని బురద పాము కాట్లు అయ్యుంటాయి!

కాదు విష నాగు కాట్లే

'అయితే మీ మనవడిని నాగు పాముతో కాటు వేయిస్తాను మంత్రం వేసి రక్షించగలరా? దర్పంగా అడిగాడు నాగరాజు

శాస్త్రి మాట్లాడలేదు

పోనీ నన్ను నేను కాటు వేయించుకుంటా రక్షిస్తారా? ఛాలెంజ్ విసిరాడు నాగరాజు

నా దంతాలు ఊడిపోయాయి నాయనా! వాక్‌శుద్ధి ఉచ్చారణ సరిగా లేకపోతే మంత్రం పని చేయదు నేనిప్పుడు మంత్రం వేయలేను


పోనీ లోక కల్యాణం కోసం దంత వైద్యునిచే పళ్ళు కట్టించుకోండి

అందరూ ఘొల్లున నవ్వేశారు శాస్త్రి ముఖం జేవురించింది మనమడి చెయ్యి పట్టుకుని గంబీరంగా రెండడుగులు వేసి నాగరాజు వైపు తిరిగాడు -

నీ మెడలో వున్న ఆ నాగరాజు యిప్పుడే బయటకు వెళ్ళిన చిన్నారావు మీద ఎందుకనో పగ పట్టి వుంది! ఏదో ఒకనాడు ఆ చిన్నారావు ఈ నాగరాజు కాటు వల్లనే మరణిస్తాడు మంత్రాలను నమ్మవద్దులే నీ సైన్స్ ఉపయోగించి అతడ్ని బ్రతికించు చాలు!" అన్నాడు

పాముకి పగా?! తన పుట్ట ఎక్కడుందో తనే గుర్తు పెట్టుకోలేని ఉత్తి మతి మరుపు జీవి పాము! వెటకారంగా నాగరాజు నవ్వుతోంటే పెద్ద అంగలు వేస్తూ శాస్త్రి మనవడ్ని లాక్కుపోయాడు

అక్కడున్న పాతిక మందిలోనూ కొందరు




# నాగరాజు

నాగరాజుని మరి కొందరు శాస్త్రిని మనసులోనే సమర్థించారు

వాళ్ళు ఆ సంబాషణను ఒకటి రెండు రోజుల్లో మరచిపోయే వారే! కాని మూడు రోజులు గడిచాకనాలుగో రోజు రాత్రి- చిన్నారావు మంచం మీద పడుకున్న వాడు పడుకున్నట్లే మరణించాడు పాము కాటు వల్ల మరణించినట్లు డాక్టర్ చెప్పాడు!

ఆ వార్త నాగపట్నంలో అపూర్వ సంచలనం కలిగించింది!

ఆ రోజు శాస్త్రి నాగరాజుల సంవాదం విన్న వారిలో స్థానిక దిన పత్రిక సంపాదకుడు కూడా వున్నాడు

చిన్నారావు మరణ వార్తను తన పత్రికలో ప్రచురిస్తూ ఆ సంపాదకుడు- సైన్స్ సైన్స్ అని గోల చేసే మిడి మిడి జ్ఞానం గాళ్ళని దుయ్యబట్టాడు అపూర్వ అద్భుత అమోఘ బారతీయ విజ్ఞానాన్ని పరిహసించే నాగరాజులాంటి కుహనా హేతువాదుల వల్లనే దేశం తగలబడిపోతోందని వాపోయాడు పాము పగ పట్టగలదని నిర్ద్వంద్వంగా నిరూపణ అయిందనీ స్నేక్‌షోలో ఎన్ని పాములు ఎంత మంది మీద పగలు పెంచుకున్నాయో తెలియదని వెంటనే ఆ ప్రదర్శనను ఆపు చేయించి నాగరాజును పట్నం నుండి పంపివేయాలని సంపాదకుడు రాసాడు

అంతే కాదు తన అభిప్రాయంతో ఏకీభవించే పాఠకులను చేరదీసి ఊరేగింపుగా కలక్టర్ వద్దకు వెళ్ళి మహజరు సమర్పించాడు

పరిస్థితి అనూహ్యంగా ఎదురు తిరగడంతో ఖిన్నుడయిపోయాడు నాగరాజు కలెక్టర్ నిషేదించినా మానినా ప్రజా విశ్వాసం కోల్పోయిన తర్వాత ప్రదర్శన ప్రయోజనం ఏమిటి? తనంతట తానే ప్రదర్శన రద్దు చేసి గుడారం విప్పేసి సామానంతా తన లారీలో చేర్చాడు

సాయంకాలం లారీ డ్రైవ్ చేసుకుంటూ పట్నణం పొలిమేర చేరుకొని లారీ ఆపాడు కిందకు దిగి కాసేపు పక్కనే వున్న చెట్టు కింద కూర్చునాడు

పది నిముషాలు గడిచాక పరమేశ్వరి శాస్త్రి మనవడు వచ్చి ఒక మూట యిచ్చి వెళ్ళిపోయాడు దానిలో మూడు వేలు కాష్ ఉంది

మరో పది నిముషాలకు తలుపులు వచ్చాడు అతడు చిన్నారావు యింటి నౌకరు అతడికి వెయ్యి రూపాయిలిస్తూ జాగ్రత్త! ఆవిషయం పొక్కిందంటె ఆ నాగరాజు నీ కొంప మీద పడతాడు! అని హెచ్చరించాడు నాగరాజు!

తలుపులు వెళ్ళి పోయాక అటు నుండి డోర్ తెరిచి లారీ ఎక్కాడు నాగరాజు

డ్రైవర్ సీటులో పోలీస్ ఇన్‌స్పెక్టర్!

ప్రక్కసీటులో కూలబడి ఏమిటిలా వచ్చారు? అన్నాడు

నిన్ను అరెస్ట్ చేద్దామని! తక్కున చెప్పి కాసేపు ఆగి ఎందుకు? - అని అడగవేం? అన్నాడు ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ

నాకు తెలుసు! చిన్నారావు ఎలాంటివాడో మీకూ తెలిసే వుంటుంది పక్కింటి పరమేశ్వర శాస్త్రి గార్ని అక్కడ నుండి తగిలేసి అక్కడ మేడ కట్టాలని చిన్నారావు ఆలోచన రోజూ వాళ్ళతో ఏదో తగాదా పెట్టుకుని వాళ్ళకి మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు చిన్నారావు అక్కడితో ఆగక శాస్త్రిగారి మనవరాల్ని రేప్ చేసాడట ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది చిన్నారావుకి పరపతి వుంది కోర్టులకు అందకుండా తప్పించుకుని వెక్కిరించేందుకు డబ్బుంది తాతలనాటి యిల్లు చిన్నారావుకి అమ్మడం శాస్త్రి గారి కిష్టం లేదు కాని వాళ్ళు అక్కడ నుండి వెళ్ళక పోతే ఆ కుటుంబాన్ని సర్వనాశనం చేయడాన్కి కంకణం కట్టుకున్నాడు చిన్నారావు ఆకలి తీరిన పాము పడగనీడలో చిట్టెలుక నిర్భయంగా ఆడుకుంటుంది కాని దనవంతుని ఆకలి తీరదు దనవంతుని మేడ నీడలో బీదవాళ్ళు బ్రతకలేరు చిన్నారావు పీడ ఒదుల్చుకోడాన్కి శాస్త్రిగారూ నేనూ కలిసి చిన్న పథకం వేశాం ఆ రాత్రి తలుపులు తలుపు తెరిచాడు చన్నారావు మంచం మీద నాగరాజుని ఒదిలేశాను అంతే నేను చేసింది న్యాయం కాక పోవచ్చు! కానీ దర్మం!" పోలీసులు అరికట్టలేని దుర్మార్గాన్ని నేను నిర్మూలించాను! చెప్పడం ఆపి ఇన్‌స్పెక్టర్ ముఖంలోకి సూటిగా చూసాడు నాగరాజు

విషనాగు తన దారిన తను పోతుంది ఎవరైనా ఎదురైతే పక్కకి పారిపోతుంది దానిని పోనివ్వకుండా దారి అడ్డగిస్తే మాత్రం కాటు వేసి చంపుతుంది అన్నాడు

'ఆ స్వరంలో ఏదో తీవ్రత వినిపించింది ఇన్‌స్పెక్టర్‌కి ఏం బెదిరిస్తున్నావా? అన్నాడు

నాగరాజు చిన్నగా నవ్వేశాడు లేదు పారిపోతున్నా అన్నాడు

నువ్వు శాస్త్రిగారి మనవడివే కదూ?' హటాత్తుగా అడిగాడు ఇన్‌స్పెక్టర్

నాగరాజు ముఖంలో నవ్వు ఆరిపోయింది కళ్ళు తడి అయాయి నన్ను వెలి వేశారు అందుకే చేసిన పనికి ప్రతిపలంగా కూలి మూడు వేలు పంపారు! అన్నాడు బాదగా

తనకూ అతనికీ మద్య వున్న గుడ్డ మీద ఇన్‌స్పెక్టర్ దృష్టి పడింది దానిలో రెండు వేలున్నాయి యింకా ఆడబ్బు తీసుకుని లారీ దిగాడు ఇన్‌స్పెక్టర్!

లారీ దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది . □